


పద్మారావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు

## ఎమ్మెల్యే పద్మారావుకు అభినందనలు

సికింద్రాబాద్,డిసెంబర్13: సికింద్రాబాద్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన పద్మారావుగౌడ్‌ను బుధవారం సికింద్రాబాద్‌లోని టకారాబస్తీలో ఉంటున్న పద్మారావుగౌడ్ నివాసంలో జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ యూసీడీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనాథ్ నేతృత్వంలో అధికారులు ధనశ్రీ యూసీడీ విభాగం అధికారులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్ కాలనీ,సవరాల బస్తీకి చెందిన నాయకులు,మొండి బండ కులస్తుల సంఘం నేత పొగర్తి భువన్ తదితరులు కలుసుకుని శుభాకాంక్షలు చెప్పారు.



ఎమ్మెల్యే పద్మారావును కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు పొగర్తి భువన్ తదితరులు

## వ్యర్థాల తొలగింపు పనుల పరిశీలన



వ్యర్థాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కంది శైలజ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: బౌద్ధనగర్ డివిజన్‌లోని ఏఆర్‌కే నగర్‌లో నాలాలో కొనసాగుతున్న వ్యర్థాల తొలగింపు పనులను స్థానిక కార్పొరేటర్ కంది శైలజ బుధవారం పరిశీలించారు. అనంతరం స్థానికులతో మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల నాలుగో సెమిస్టర్ మేకప్ పరీక్షా ఫీజును ఈ నెల 21లోగా, మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండు, నాలుగో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును ఈ నెల 29లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఎంఏ (ఓరియంటల్ లాంగ్వేజెస్) మొదటి, మూడో సెమిస్టర్, బీఏ (ఓరియంటల్ లాంగ్వేజెస్) మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 27వ తేదీలోగా చెల్లించాలన్నారు. రూ.500 అపరాధ రుసుముతో వచ్చే నెల 3లోగా చెల్లించాలన్నారు. ఎల్ఎల్ఎం మూడో సెమిస్టర్ రెగ్యులర్, మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సులు మూడు, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏఎల్ ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 30లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 8 వరకు చెల్లించవచ్చని చెప్పారు. ఈ పరీక్షలను జనవరి నెలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తా

### ఎమ్మెల్యే జి. లాస్యనందిత

మారేడ్‌పల్లి, డిసెంబర్ 13: కంటోన్మెంట్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుస్తామని ఎమ్మెల్యే జి. లాస్యనందిత అన్నారు. కంటోన్మెంట్ నాలుగో వార్డు లోని పికెట్ ఎరుకల బస్తీలో బుధవారం ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించి వెంటనే స్పందించారు. కొత్త బోర్ వెల్‌కు మోటర్‌ను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లాస్యనందితకు స్థానికులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేరేలా పని చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, రాంమోహన్, కిరణ్, మల్లేష్, బస్తీ వాసులు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ నాలుగో వార్డులోని పికెట్ ఎరుకల బస్తీలో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జి. లాస్యనందిత



# సీసీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: తార్నాక డివిజన్ హనుమాన్ నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. పనుల నిర్వహణ, నాణ్యతను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, హనుమాన్‌నగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

# అంజయ్య మృతి పార్టీకి తీరనిలోటు

### ఆయన భౌతికకాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



అంజయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

అడ్డగుట్ట, డిసెంబర్ 13 : అడ్డగుట్ట డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తిట్ల అంజయ్య (72) బుధవారం ఉదయం మృతి చెందాడు. ఈ నెల 7న హబ్సిగూడ నుంచి తుకారాంగేట్‌కు బైక్‌పై వస్తున్న అంజయ్యను ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయం అయ్యింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుదిశ్వాస విడిచారు. అంజయ్య మృతి విషయాన్ని తెలుసుకున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ తుకారాంగేట్‌లో ఆయన నివాసంలో భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అంజయ్య కుటుంబసభ్యులకు పద్మారావు రూ.లక్ష రూపాయల ఆర్థికసాయాన్ని అందించారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ... అంజయ్య మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అంజయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన వారిలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నక్కమధు, లింగాని శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, మనోహర్, మధు గౌడ్, పొన్నాల రాజు, వడ్డెర ఎల్లయ్య, అమర్, కైరంకొండ యాదగిరి, దేవయ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వార్డు కార్యాలయం పనులు పరిశీలన



నామాలగుండులో వార్డు కార్యాలయ నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్,డిసెంబర్13: నామాలగుండులోని వార్డు కార్యాలయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు.బుధవారం నామాలగుండులో జరుగుతున్న వార్డు కార్యాలయ నిర్మాణ పనులను ఆమె సికింద్రాబాద్ సర్కిల్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు.అక్కడ జరుగుతున్న పనుల తీరును అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ...వార్డు కార్యాలయ నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు.త్వరగా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు ఈఈ ఆశలత, డీఈ సువర్ణ, ఏఈ కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## సీవరేజీ లైన్ నిర్మాణ పనులు పరిశీలన

సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలోని చిలకలగూడ కింది బస్తీలో జరుగుతున్న సీవరేజీ లైన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ సామలహేమ పరిశీలించారు.

## రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ, బీపీఈడీ, డీపీఈడీ కోర్సుల సెమిస్టర్ల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తరువాత పొందవచ్చని పేర్కొన్నారు. బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 19లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 21వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

# తక్షణమే కులగణన చేపట్టాలి

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 13: తక్షణమే దేశంలో కులగణన చేపట్టాలని ఓయూ జేఏసీ అధ్యక్షుడు డాక్టర్ ఎల్చల దత్తాత్రేయ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టి, రాజకీయాల్లో 50 శాతం బీసీ రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. ఈ మేరకు ప్రధాని నరేంద్రమోదీ కార్యాలయమైన సౌత్ బ్లాక్ రైజినా హిల్స్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని కోరారు.

- మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కేటాయించాలన్నారు.
- కేంద్రంలో ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- కేంద్రప్రభుత్వం అన్ని జిల్లాలో మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ కమ్యూనిటీ భవనాలను నిర్మించాలని, బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించాలన్నారు.
- బీసీ వసతి గృహాలకు పక్కా భవనాలను కట్టించాలని, కేంద్ర, రాష్ట్ర నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం పదవులు కేటాయిస్తూ చట్టం చేయాలని అన్నారు.
- ఎంబీసీ కులాలకు సామాజిక రక్షణ చట్టం కల్పించాలని కోరారు.
- మండల్ కమిషన్ రిపోర్టును వెంటనే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలి**



ప్రధాని కార్యాలయం ముందు వినతిపత్రంతో ఎల్చల దత్తాత్రేయ

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని బీఆర్ఎస్ నాయకుడు వీరమళ్ల రామ్‌నర్సింహగౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై జాప్యాన్ని నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రామ్‌నర్సింహగౌడ్ మాట్లాడుతూ గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లును తీసుకువచ్చి, ఎలాంటి విధివిధానాలు, రిజర్వేషన్లు ఇవ్వకుండా బీసీలను బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్రం వెంటనే స్పందించి బీసీలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.